క్లుప్తంగా

సకాలంలో రుణాలు చెల్లించాలి

చీరాల టౌన్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూదనరావు సూచించారు. శుక్రవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలని తెలిపారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్‌ప్లాన్ రుణాలన్నీ వంద శాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాని కోరారు. రుణం వాయిదాలు పూర్తయిన గ్రూపులకు అదనపు మొత్తంతో రుణం అందించాలని తెలిపారు. సమావేశంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

అద్దంకి: ఖరీఫ్‌కు ముందు నేల బలం కోసం మాగాణి భూముల్లో సాగు చేసే పచ్చి రొట్ట విత్తనాలు రైతులకు రాయితీపై అందిచడానికి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి కె. వెంకటకృష్ణ తెలిపారు. జీలుగలు, జనుము విత్తనాలను ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాలకు చేరాయని తెలిపారు. జనుములు కిలో రూ.61.50, జీలుగలు రూ.54.50 రాయితీ పోను ఇస్తారని తెలిపారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి పచ్చి రొట్టవిత్తనాలను తెచ్చుకోవచ్చని చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

కారంచేడు: బహిరంగ ప్రదేశాల్లో యువత మద్యం సేవించే కార్యక్రమాలు చేపట్టవద్దని కారంచేడు ఎస్ఐ వి. వెంకట్రావు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంతో పాటు, కారంచేడు–కుంకల మర్రు దొంగతూముల వద్ద, స్వర్ణ–కారంచేడు రహదారిలో పంపు షెడ్ల వద్ద, తూముల వద్ద, చీరాల–స్వర్ణ రోడ్డులోని దండుబాటలో యువకులు మద్యం సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆయన తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ మార్గాల్లో గుంపులుగా కూర్చొని మద్యం సేవించే యువతకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమన్నారు.

కాటాలు రెన్యువల్ చేయించుకోండి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వ్యాపారస్తుడు విధిగా వారి తూకం (కాటాలను) ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకుని వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని తూనికలు, కొలతల శాఖ చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లోని కూరగాయల మార్కెట్లు, పండ్ల దుకాణాల్లో కాటాల రెన్యువల్స్‌ను పరిశీలించారు. ఏడుగురు వ్యాపారులు తమ కాటాలను రెన్యువల్ చేయించుకోకుండా వ్యాపారాలు చేస్తుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరారవు మాట్లాడారు. ప్రతి వ్యాపారస్తుడు విధిగా తమ తూకం కొలిచే కాటాలను, రాళ్లను విధిగా రెన్యువల్ చేయించుకుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. వినియోగదారులకు తూకాల్లో మోసాలు జరగకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఆదేశాలను విధిగా అంతా వ్యాపారులు పాటించాలని తెలిపారు. తూకం రాళ్లు, డిజిటల్ కాటాలను తూనికల ఇన్‌స్పెక్టర్ వద్ద రెన్యువల్ చేయించుకోవాలని, తూకంలో తేడాలు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వినియోగదారులను మోసాలకు గురిచేస్తే వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. చీరాల డివిజన్ పరిధిలోని వ్యాపారస్తులు అంతా తమ కాటాలను రెన్యువల్ చేయించుకోవాలన్నారు.

పాదచారులకు చెప్పులు, గొడుగుల అందజేత


పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు బొమ్మల సెంటర్‌లో 24 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ తెలిపారు. తన తల్లిదండ్రులు తోకల నాగయ్య, సుబ్బాయమ్మ జ్ఞాపకార్థం ఆయన ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్. మోహనరావు పాల్గొని పాదచారులకు చెప్పులు, గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 14 రోజుల రిమాండ్

అద్దంకి రూరల్: మండలంలోని చిన కొత్తపల్లి గ్రామం వద్ద ఈనెల 10వ తేదీ జరిగిన దొంగతనం కేసులో అదుపులోకి తీసుకున్న నిందితులకు అద్దంకి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు శుక్రవారం రాత్రి ఎస్ఐ రవితేజ తెలిపారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన షేక్ సుభాని, మార్కాపురానికి చెందిన షేక్ నాగూర్ మీరావలికి శిక్ష విధించగా, వారిని ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.



చెన్నుపల్లి -వైదన లింకు రోడ్డు కోసం తెచ్చిన సుద్ద మట్టి



రోడ్డుపైనే ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైను

‘సుద్ద’ దండగ

- రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతకు పాతర
- అతి నెమ్మదిగా సాగుతున్న వైనం
- రోడ్డుకు అడ్డుగా వేస్తున్న విద్యుత్ పోల్స్
- మార్జిన్లకు సుద్దమట్టి వేస్తున్న వైనం

బల్లికురవ:

గ్రామాలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని లింక్ రోడ్డు అభివృద్ధి పనులను నెమ్మదిగా చేయడమే కాకుండా.. నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేశారు. మండలంలోని చెన్నుపల్లి–వైదన లింక్ రోడ్డు ఆరు కిలో మీటర్ల మేర అభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈఏడాది మార్చిలో మూడు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రహదారికి ఇరువైపులా ఉన్న చిల్ల చెట్లను తొలగించి పాత రోడ్డును పగులగొట్టి చదరం చేశాడు. అప్పటి నుంచింకా పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులకు కష్టాలు మొదలయ్యాయి.

ప్రాధాన్యత ఉన్న రహదారి

చెన్నుపల్లి–ముక్తేశ్వరం–సూరేపల్లి–వైదన గ్రామాల్లో మాగాణి భూములు నాగార్జున సాగర్ కాలువ ఆయకట్టు పరిధితో ఉంటాయి. ఈ లింకు రోడ్డును క్రాస్ చేస్తూ అద్దంకి బ్రాంచ్ కాలువ ప్రవహిస్తోంది. అలాగే ముక్తేశ్వరం, సూరే పల్లి గ్రామ సమీపంలోని కొండల నుంచి గ్రానైట్ రాళ్లు నిత్యం ఈ రోడ్డు ద్వారానే ఎగుమతులు చేస్తుంటారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులు, పశుగ్రాసాన్ని తరలించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డులో ఎర్త్ వర్క్ పనులు సక్రమంగా జరగటం లేదని ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. పనుల్లో నెలకొన్న నిర్లక్ష్యాన్ని ఇటీవల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పనులు పూర్తి కాకుంటే తిప్పలే..

రోడ్డు మార్జిన్ల అభివృద్ధి పనుల్లో సుద్ద మట్టిని కింద పోసి.. దానిపై ఎర్రమట్టి చల్లుతున్నారు. మార్జిన్లు పటిష్టంగా లేకపోతే రోడ్డు దెబ్బ తినే ప్రమాదం ఉంటుంది. మూడు నెలలుగా పనులు ఎర్త్ వర్క్‌కే పరిమితమయ్యాయి. రోడ్డు మొత్తం లెవలింగ్ చేసి.. వెట్ మిక్స్, తారు వేసే పనులు చేయాలి. అయితే ఇటీవల నుంచి కురుస్తున్న వర్షాలకు భూములు పదునెక్కడంతో జూన్, జూలై మాసాల్లోనే వ్యవసాయ పనులకు రైతులు సమాయత్తం కానున్నారు. ఈ క్రమంలో రోడ్డు పనులు పూర్తి కాకపోతే రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు.



సుద్ద మట్టి చదరం చేశాక పైపూతగా తెచ్చిన ఎర్ర గ్రావెల్

ఎదురెదురు వాహనాలు వస్తే?

ఇటీవల బల్లికురవ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చెన్నుపల్లి ముక్తేశ్వరం గ్రామాల మీదుగా సూరేపల్లికి ప్రత్యేక లైన్ శాంక్షన్ అయింది. ఈ లైన్‌కు సంబంధించి విద్యుత్ పోల్స్‌ను రోడ్డుపైనే వేస్తున్నారు. ఎదురుగా వాహనాలు వస్తే తీవ్ర ఇబ్బందులు తప్పవని.. రోడ్డుకు కింది భాగంలో స్తంభాలు వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏఈలు కేవీ మహేశ్వరరావు కె. శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు.

అందరికీ ఇదే మార్గం

మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు. వెలమవారిపాలెం, జమ్మలమడక కాలనీలు.. వైదన, కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయ పురం వాసులు మండల కేంద్రమైన బల్లికురవ, జిల్లా కేంద్రమైన బాపట్లకు ఈ మార్గం నుంచే వెళ్లాలి. అలాగే చెన్నుపల్లి, కొండాయపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు వాసులు నామ్ రహదారి, వైదన, వినుకొండ వెళ్లడానికి ఇదే దగ్గర మార్గం. ఈ విషయాలపై రహదారి ఏఈ కేవీ మహేశ్వరరావును వివరణ కోరగా అంచనాల ప్రకారం ప్రమాణాల మేర పనులు చేయిస్తామన్నారు. రోడ్డుపై కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ పోల్స్ రోడ్డు దిగువన వేయాలని ఆ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.


ప్రమాణాలతో అభివృద్ధి చేయండి:



ఎంతో ప్రాధాన్యత కలిగిన చెన్నుపల్లి–వైదన లింక్ రోడ్డు అభివృద్ధిలో ప్రమాణాలు పాటించాలి. రోడ్డు మార్జిన్లు సుద్ధ మట్టితో వేస్తే.. గోతులు ఏర్పడి రోడ్డు దెబ్బ తినే ప్రమాదం ఉంది. కొత్తగా సూరేపల్లికి ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్, రోడ్డుకు దిగువ భాగంలో ఏర్పాటు చేయాలి.

దేవినేని కష్ణబాబు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్

ఇది జారుడు బల్లా.. రోడ్డా!



జారుడు బల్లను తలపిస్తున్న చెన్నుపల్లి - అనంతవరం రోడ్డు

- తారు రోడ్డును మట్టి రోడ్డుగా మార్చిన గ్రానైట్ నిర్వాహకులు
- తరచూ ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

బల్లికురవ: ప్రధాన రహదారిని గ్రానైట్ నిర్వాకులు తమ ఆధీనంలోకి తీసుకుని రోడ్డు మార్జిన్‌లోనే యంత్రాలు నిలపడం లోడింగ్ పనులు చేపట్టడం నిత్తకృత్యంగా మారింది. దీంతో తారు రోడ్డు ఆనావాళ్లు కోల్పోయి మట్టిరోడ్డుగా మారి చినుకు పడితే జారుడు బల్లను తలపిస్తోంది. మండలంలోని చెన్నుపల్లి నుంచి మల్లాయపాలెం, వేమవరం జంక్షన్ తాతాపూడి మీదుగా బాపట్ల జిల్లా అనంతవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును గ్రానైట్ నిర్వాహకులు కొండాయపాలెం, కొత్తమల్లాయ పాలెం, గ్రామ సమీపం వరకుకిలోమీటర్నర వరకు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బల్లికురవ సంతమాగులూరు మండలాల్లోని 30 గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రమైన బాపట్ల, చిలకలూరి పట్టణానికి వెళ్లేందుకు ఇది దగ్గరి మార్గం. వర్షాలు కురవటంతో బురదమయంగా ఉన్న రోడ్డులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



ఆనవాళ్లు లేని తారు రోడ్డు

ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు చెన్నుపల్లి, బల్లికురవ, మల్లాయపాలెం మీదుగా వెళ్లాల్సి రావటంతో 5 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. ఆర్అండ్ బీ అధికారులకు అనేక పర్యాయాలు విన్నవించిన ఎలాంటి చర్యలు లేవని ఇప్పటికైనా ప్రమాదాలకు చెక్‌పెట్టి దూరాన్ని తగ్గించేందుకు రోడ్డుపై మట్టిని తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు.

నీటి ట్యాంకర్ కూల్చివేత ప్రక్రియ ప్రారంభం



కూల్చటానికి సిద్ధంగా ఉన్న మంచినీటి ట్యాంకర్

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకం కూల్చివేత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ప్రదేశంలో రాకపోకలు నిషేధించినట్లు కమిషనర్ రవీంద్ర తెలిపారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం రేవతి నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రహదారి ఆక్రమణలను సత్వరం తొలగించాలి



ఇంకొల్లు సెంటర్‌లో దుకాణ దారులను హెచ్చరిస్తున్న పోలీసులు

ఇంకొల్లు(చినగంజాం): ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగిస్తున్న రహదారిపై ఆక్రమణలు సత్వరం తొలగించాలని ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్ హెచ్చరించారు. ఇంకొల్లు రహదారిపై దుకాణ దారులు ప్రధాన మురుగు కాలువ వెనక్కి ఉండాలని, దుకాణాల యజమానులు తిరిగి రహదారిపైకి హోర్డింగులు, రేకులు వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని తెలియజేశారు. దుకాణ యజమానులు ముందుకు రాకుండా రోడ్డు మార్జిన్ అవతలి వైపునే ఉండాలని ఇంకా ఎవరైనా ఉంటే రెండు రోజుల్లో తొలగించాలని ఆయన మైకు ద్వారా అనౌన్స్ చేసి మరీ వారిని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, అడ్డగడ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ నాగలక్ష్మి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌తో జాగ్రత్త



కోవిడ్‌పై సూచనలు ఇస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: కోవిడ్– 19 పాజిటివ్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జి. రవితేజ శుక్రవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 260, ఆంధ్రాలో 3 కేసులు నమోదయ్యాయని దీంతో కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. సామూహిక సమావేశాలు, శుభకార్యాలు, ప్రార్థనలకు తగు జాగ్రత్తలతో వెళ్లాలన్నారు. వృద్ధులు, గర్భిణులు శుభకార్యాలకు కొంత కాలం పాటు దూరంగా ఉండాలన్నారు. జలుబు, దగ్గు, జర్వంతో అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యశాలలకు వచ్చి పరీక్షలతో చికిత్సలు పొందాలన్నారు. మాస్క్ ధరించడం, తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు చేతి గుడ్డ అడ్డుపెట్టుకోవడం చేయాలని కోరారు.

సుఖీభవ పథకానికి అర్హుల గుర్తింపు

బల్లికురవ: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులను గుర్తిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి ఎస్‌వీపీ కుమారి శుక్రవారం తెలిపారు. మండలంలోని 20 రైతు సేవా కేంద్రాల్లోని రైతులకు సంబంధించిన పొలాలకు ఆన్‌లైన్‌లో పూర్యిఫికేషన్ కార్యక్రమం జరుగు తుందని చెప్పారు. రైతుకు సంబంధించిన భూమి ఖాతాను పరిశీలించే క్రమంలో వైబ్‌సైట్ లో సర్వర్ కనెక్టుతో కొంత ఆలస్యం జరిగిందని చెప్పారు. తిరిగి ప్రభుత్వం ఈ గడువు పెంచటంతో తుది దశకు చేరిందని కుమారి వివరించారు.

సర్క్యులర్ పునరుద్ధరణపై హర్షం



బస్టాండ్ వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

చీరాల అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులపై చిన్న తప్పిదాలకే పెద్ద శిక్షలు అమలు చేస్తుండడంతో ప్రభుత్వం స్పందించి గతంలో నిలిపివేసిన 1/2019 సర్క్యులర్‌ను పునరుద్ధరించడంపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ జోన్–3 కార్యదర్శి తులసి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ ఉద్యోగులు చిన్న తప్పిదాలు చేస్తే పెద్ద శిక్షలు అమలు చేసేవారని, ప్రస్తుతం 1/2019 సర్క్యులర్ తిరిగి పునరుద్ధరించడం హర్షణీయమన్నారు. యాజమాన్యం ఈ సర్క్యులర్‌కు కట్టుబడి శిక్షలు కాకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. రిలేదీక్షలు, పోరాటాలతో సాధించుకున్న విజయమన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు స్వీట్లు పంచారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, పి.దయాబాబు, సీసీఎస్ డెలిగేట్ డి.ప్రవీణ్‌కుమార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైర్ ఫైటింగ్ శిక్షణ



క్యాడెట్‌లకు ఫైర్ సేఫ్టీపై శిక్షణ ఇస్తున్న అధికారులు

వేటపాలెం: చీరాల ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణలో 23వ రాష్ట్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు శుక్రవారం ఫైర్ ఫైటింగ్ పై శిక్షణ నిర్వహించారు. చీరాల అగ్నిమాపక శాఖ అధికారులు క్యాడెట్లకు వాస్తవిక పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరించారు. అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థి తుల్లో ఉపయోగించే పరికరాల వినియోగం గురించి లీడింగ్ ఫైర్ మెంబర్, సీహెచ్ బ్రహ్మయ్య డెమో ద్వారా వివరించారు. అనంతరం క్యాడెట్లు స్వయంగా అగ్ని మాపక పరికరాలు ఉపయోగించి ప్రాక్టికల్ అనుభవం పొందారు. క్యాడెట్లలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే నైపుణ్యం పెంపొందడంతో పాటు సమాజ సేవ లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు తెలిపారు. అనంతరం అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బృందాన్ని క్యాంపు కమాండెంటిగ్ లెఫ్టినెంట్ కర్నల్ ఎస్ఎస్ పర్మర్, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ దినేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేజర్ రాజు, సుబుదార్ మేజర్ నజీర్, ఏఎన్ఓ హరీష్, మేడికొండ రాజేష్‌బాబు, దివ్యా, సురేష్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాల అందజేత



విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

యద్దనపూడి: యనమదల గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో 70 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు.. 10 వ తరగతిలో యద్దనపూడి మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన 6 గురు విద్యార్థులకు స్టడీ చైర్‌లను బహూకరించారు. యనమదల గ్రామానికి చెందిన ఇరువురికి షష్టిపూర్తి మహోత్సవం చేశారు. అనంతరం 300 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ చుండూరి గాయత్రి, క్లబ్ కార్యదర్శి రాఘవేంద్రరావు, యద్దనపూడి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలిశెట్టి హనుమంతరావు, క్లబ్ అధ్యక్షులు కొత్తూరి వెంకట రాంబాబు, కార్యదర్శి పోలిశెట్టి బసవయ్య, ట్రెజరర్ పోలిశెట్టి వెంకట నరసింహారావు, సీనియర్ ఉపాధ్యాయులు కేవీ రమణయ్య, పోలిశెట్టి సుబ్బారావు, బొంతల హనుమంతరావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష విభిన్న ప్రతిభావంతుల సర్వే



విభిన్న ప్రతిభావంతుల సర్వే నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్

చినగంజాం: మండలంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతుల సర్వే నిర్వహిస్తున్నట్లు చినగంజాం భవిత కేంద్రం ఐఆర్పీలు టి. బాలకృష్ణ, డి. నాగార్జున తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ఈ నెల 13 నుంచి జూన్ 9 వరకు సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు 3 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది చినగంజాం మండలంలో నిర్వహించిన సర్వేలో మొత్తం 145 మంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించినట్లు తెలిపారు. ఈ సంవత్సరానికి ప్రస్తుతం 4 గురు విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వారికి ప్రభుత్వం తరఫున ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్, హోమ్ బేస్ అలవెన్స్, గరల్స్ స్టైఫండ్ అలవెన్స్, వినికిడి యంత్రాలు, ట్రైసైకిల్‌ను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభా వంతులు ఎవరైనా ఉన్నా వెంటనే భవిత కేంద్రంలో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 466 మంది హాజరు



పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జరుగుతున్న ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 466 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రాకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరగుతున్న పరీక్షలకు ఉదయం 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 233 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ కె. జగదీష్ బాబు తెలిపారు. సాయంకాలం రెండో షిఫ్టులో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 233 మంది హాజరైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ నజీర్

మార్టూరు: ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన సంఘటన శుక్రవారం సాయంత్రం స్థానిక జాతీయ రహదారిపై కోనంకి సమీపంలో చోటు చేసుకుంది. హైవే పెట్రోల్ సిబ్బంది నాయక్ వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామానికి చెందిన షేక్ నజీర్ బైక్‌పై జె. పంగులూరు మండలం అలవలపాడు గ్రామం నుంచి స్వగ్రామం వెళుతున్నాడు. కోనంకి ఇసుకదర్శి గ్రామాల మధ్య హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో నజీర్ బైక్‌ను వెనుక నుంచి కారు బలంగా ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది నాయక్ ప్రమాద స్థలికి చేరుకొని నజీర్‌ను 108 వాహనంలో చిలకలూరి పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కడప జిల్లా పులివెందులకు చెందిన సంపంగి నరేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.